# గట్టున పడ్డ చేప

స్టేషనులో రైలు ఆగగానే ఫస్టు క్లాసు కంపార్టుమెంట్ లోంచి ప్లాట్ ఫారం మీదకు చూసింది కుముద. తన్ని తెలుసున్న ముఖా లేమీ కన్పించలేదు. "అమ్మయ్య" అని గాఢంగా ఊపిరి పీల్చింది. పోర్టర్ ని పిలిచి, లెదర్ సూట్ కేసూ, పళ్ళబుట్టా దింపించింది. స్టేషన్ బయటనున్న బస్ స్టాండుకి నడిచింది. అయిదారేళ్ళబట్టీ కుముదకి ప్రయాణాలు చేయటంలో ఇంత స్వేచ్ఛ వుండటం లేదు. రైలు ఆగిన ప్రతి స్టేషన్ లోనూ, ఫ్లాష్ బల్బుల క్లిక్ లతో గులాబీల బొకేలతో వివిధరకాల పూలదండలతో, మృదువుగా నవ్వే పెదాల పైనించి, తోడేళ్ళ ఆకలి చూపులతో వివిధ రకాల, వివిధ వయస్సుల జనం, తన కంపార్టుమెంటు చుట్టూ మూగేవారు. ఇంక తను దిగాల్సిన స్టేషన్ రాగానే ఉక్కిరిబిక్కిరి చేసే జనసందోహాన్ని, పోలీసులు, అదుపులో పెట్టుతూండగా ప్లాట్ ఫారంనించి, బయట ఇంపాలా దాకా, రాజహంసలా, నృత్యమయూరిలా వయ్యారి నడకలతో నడవటం అలవాటు అయింది. ఆమె ఇప్పుడు ఆంధ్రుల అభిమాననటి. సంవత్సరానికి సుమారు పాతిక పిక్చర్లు దాకా ఆమె నటించినవి విడుదల అవుతున్నాయి. ఆమెని నాయికగా బుక్ చేశామని చెప్తేచాలు, డిస్ట్రిబ్యూటర్స్ ఒక్కరీలయినా తయారవకుండానే పిక్చర్ ని కొనేస్తారు. ఉదయం హైద్రా

బాదు, మధ్యాహ్నం మద్రాసు, రాత్రికి బొంబే, ఇల్లా ఎడతెరపిలేకుండా మూడునగరాల మధ్యా స్పుత్నిక్‌లా తిరిగే కుముద, అట్టహాసం లేకుండా రైలు దిగి, తనకి తనే మామూలు ప్రయాణీకురాలిలా సామాను పట్టించుకొని బస్‌స్టాండుదాకా నడిచి వెళ్ళిందంటే దానిక్కారణం తాయారు, వెంకట్రాజు! వెంకట్రాజు ఎవరో కాదు. కుముదకి,దురదృష్టం వెన్నంటితే కుముదకి ఖచ్చితంగా అవ్వాల్సిన భర్త! స్వయానా మేనత్త కొడుకు! వాళ్ళిద్దరికీ సంబంధం వున్నా, వాళ్ళు మల్లీశ్వరీ నాగరాజుల్లా ప్రేమించుకోలేదు.మామూలు బంధుత్వం తప్ప,మరువలేని మమతలూ,మధురమైనబాసలూ పెనవేసుకున్న అనుబంధాలూ, అనురాగాల సరాగాలూ వాళ్ళిద్దరి మధ్యా ఉత్పత్తి అవలేదు. అయితే హఠాత్తుగా తన నటనా కౌశలంతో ప్రేక్షక లోకాన్ని ఉర్రూతలూగించే కుముద, తనకి అవ్వాల్సిన భర్తని చూసి తీరాలని తన కనకపుసింహాసనాన్ని దిగి ప్రయాణించటం కేవలం "తాయారు" కోసమే అన్నా తప్పులేదు. వెంకట్రాజుకన్నా తాయారు అంటే కుముదకి పంచప్రాణాలు. తనీనాడు లక్షలకధికారిణి అయి తను చిన్ననాడు కన్న కలలన్నీ పంచరంగుల్లో ప్రతిఫలించుతున్నాయంటే,దానిక్కారణం తాయారు అని కుముద ప్రతీక్షణం అనుకుంటుంది. అందుకనే ఆర్నెల్లనించీ తాయారు నించి తానెన్ని జాబులు వ్రాసినా జవాబు రాకపోవటంతో ఇంక ఆగలేక నించున్నపళంగా బయలుదేరి వచ్చేసింది కుముద. కుముదకీ తాయారుకీ స్నేహం విచిత్రంగా కలిసింది. కుముద వాళ్ళుండేది మధ్యతరగతి

పట్టణం. కుముద తల్లిదండ్రులు మరీ పేదవాళ్ళు కారు. అలా అనీ కుముదని ఒక జడ్జి కొడుక్కి ఇచ్చి పెళ్ళి చేయగలంత తాహతుగల వాళ్ళు కాదు. కుముద ఆరోతరగతి చదువు తూండగానే పెద్దమనిషి అయ్యింది. స్కూలు మానిపించేసారు. మేనత్త కొడుకు వెంకట్రాజు రెడీగానే ఉన్నాడు. వెంకట్రాజు తల్లితండ్రులకి ఒక్కడే కొడుకు. అరఎకరా మామిడితోటా, ఎకరం పల్లపుభూమీ వున్నాయి. తండ్రి చనిపోగా స్వంత సేద్యం చేసుకుంటూ వుండిపోయేడు. చిన్న పెంకుటిల్లువుంది. రెండు గేదెలున్నాయి. కోడలికి రెండుతులాల బంగారం కూడా జాగ్రత్తచేసింది కుముద మేనత్త వెంకమ్మ. వెంకట్రాజుకి నలుగురు అక్కలున్నారు. ముగ్గురికి పెళ్ళిళ్ళు అయినాయి. నాలుగో అక్కకి సంబంధం వస్తే ఆమెకి పెళ్ళిచేసి చేసుకుంటాను అన్నాడు. సరే అప్పుడు చేయొచ్చులే! అని చదువు మాన్పించేసి ఇంట్లో కూర్చోబెట్టారు కుముదని, కుముద తల్లితండ్రులు. కుముదకాక ఇంకా ఏడెనిమిది పిల్లలు ఆడా మగా ఉన్నారు. కుముద తల్లితండ్రులకి. చిన్నఇంటిలో పిల్లలంతా కిటకిటలాడుతూవుండే వారు. ఎదురింటిలో విశాల వుండేది. ఆమె ఒక ఇన్స్పెక్టరు భార్య. తాయారు ఆమెకి వేలువిడిచినపినతల్లి కూతురు. విశాలఇల్లు ఎంతో నీట్ గానర్ది వుంచేది. కాలక్షేపం కోసం కుముదని పిలిచి కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పేది. తోడుగా వుంటుందనీ తాయారుకి దిక్కూమొక్కూ లేదనీ జాలితలచి తాయారుని తీసుకువచ్చింది. తాయారు ఏపుగా పచ్చగా దృఢంగా వుండేది. పెద్దపెద్ద

కళ్ళు వంకులొంకుల జుత్తు. విశాల దగ్గరికి వచ్చిన ఆరె్నల్లకే బంగారు బొమ్మలా తయారయ్యింది. కుముద చామన ఛాయలో వున్నా కన్ను ముక్కు తీరుగా వుండేది. బారెడు జుట్టు. ఎడమకంటిలో కొద్దిగా మెల్ల. "నీది సిరిమెల్లే" అనేది తాయారు. తాయారు ముందు కుముద బక్కపలచగా పేలగా అగుపించేది. తాయారంటే కుముదకి చెప్ప లేనంత భక్తి, విశ్వాసం. తాయారు చెప్పే కబుర్లువింటూ, నోరు తెరిచేసేది కుముద. అప్పటికి కుముదకి పదమూడేళ్లుకూడా నిండలేదు. ఇన్స్పెక్టర్ గారిది విశాలమయిన ఇల్లు, పెద్ద హాలూ, పైన గిరగిర తిరిగే సీలింగ్ ఫానూ, సోఫాలూ, రేడియో ఇవి అన్ని కుముదను అమితంగా ఆకర్షించేయి. తాయారు రోజురోజుకీ బొద్దుగా, చేతికి నిండుగా తయారయి పోతుంటే ఇన్స్పెక్టర్ వూరుకోలేక పోయేవాడు. కాంపుకి వెళ్ళి వస్తూవస్తూ సినిమా పత్రికలు, సెక్స్ పత్రికలూ కొని తెచ్చేవాడు. అవి ఇద్దరూ కలిసి చదువుకుంటూ వుండేవారు. ఇన్స్పెక్టర్ వూళ్ళో వున్నప్పుడు విశాల తాయారుకి డబ్బులిచ్చేది. ఇద్దరూ కలిసి బెంచి టిక్కెట్టుతో సినిమాలు చూసేవారు. నాయిక కడుపేదరాలయి అష్ట కష్టాలు పడటం, గొప్పింటి అబ్బాయి అమ్మాయిని ప్రేమించి తల్లినీ తండ్రినీ ఎదిరించి ఆ అమ్మాయిని పెళ్లాడటం, చివరికి పెద్ద భవనానికి వారసుడవటం. ఇవి అన్నీ కుముదకి ఎంతో నచ్చేవి ! పరిపక్వంకాని మనసు, వచ్చీరాని చదువు ! పనికి రాని పరిజ్ఞానం వీటివల్ల కుముద తను చాలా తెలివిఅయిన దాన్ననీ, నిత్య దరిద్రం ఓలలాడుతుండే ఈ ఇంటినుంచి తను

తప్పించుకు పారిపోవాలనీ, అప్పుడు సిండరెల్ల కథలోలాగ ఎవరో ఒక రాజకుమారుడు తన్ని వరించి వస్తాడని తల పోసేది. ఇంక తాయారు ఇంట్లో తిరుగుతూంటే ఇన్స్పెక్టర్ చూపు పూరుకునేది కాదు ! బావగారి వేళాకోళాలికి ఇంకా తలమునకలై పోయేది తాయారు ! పల్చని జార్జెటు పమిట వదులుగా ఇటూఅటూ జారిపోతూవుంటే విరగబడినవ్వుతూ కబుర్లుచెబుతూ కూర్చునే తాయారుని చూస్తే, లోపల్లోపల ఈ తద్దినంనుంచి ఎలా తప్పించుకోవాలో అని కుళ్ళిపోయేది విశాల. తీరా సాకుతానని చెప్పి తీసుకవచ్చింది. వాళ్లింట్లో వీళ్ళింట్లో అంట్లుతోమి బట్టలుతికి గుప్పెడు మెతుకులు తినే తాయారునిచూస్తే అయ్యోబంధువు కదా అని మనసు ఆర్ద్రిత చెంది ఆగలేక తీసుకువచ్చింది. కూలికివచ్చి ఆలై వెలసిపాలిమ్మని కూర్చుందన్న సామెత నిజం చేయబోతోంది తాయారు. విశాల సహజంగా తెలివితేటలు కలది. తాయారుని ఎలా సాగనంపాలా అని పాచికలు వేస్తూ కూర్చుంది. కుముద సన్నటి కీచుగొంతుతో సినిమాపాటలు బాగా పాడేది. "ఎంత బాగా పాడుతావ్ కుముదా ! ఇంత బాగా పాడే వాళ్ళు సినిమాలోవుంటే బాగా రాణిస్తారు" అంటూ ఎక్కేసేది విశాల. బాగా ఎండగావున్న ఒకరోజు కుముదవచ్చి విశాల దగ్గర ఏడ్చేసింది. విశాల ముందు గాభరాపడినా తరువాత సముదాయించి "ఏమిటి" అని అడిగింది. "నాకు పెళ్లి చేస్తారుట ! ఏడో తారీకున ముహూర్తం కూడా పెట్టేశారు." విశాల నవ్వింది. "భలేదానివే ! హాయిగా పెళ్ళి చేస్తుంటే ఏడుపెందుకు ? పెళ్లిళ్లు అవక, అయ్యే మార్గంలేక

బోలెడుమంది కన్నెపిల్లలు ఏడుస్తున్నారు" అంది. తాయారు కుముద కళ్ళు తుడిచింది ఆప్యాయంగా.

"అది కాదక్కయ్యగారూ! వెంకట్రాజుది పల్లెటూరు. ఎంతకీ గేదెలని కడగటం, వాటికి మేతవెయ్యటం గడ్డికోసుకురావటంతప్ప చదువుకుందుకి పుస్తకాలు, చూసేందుకు సినిమాలు వుండవు. మా అత్తకి కళ్ళు తిన్నగా కనబడవు. వదినలందరూ పెళ్ళిళ్ళయి అత్తారిళ్ళకు వెళ్ళిపోయారు. ఆఖరి వదినకి పెళ్ళి కుదిరిందట. ఆవిడలగ్నంతో నాదికూడా కానిచ్చేస్తే సరిపోతుంది అంటోంది మా అత్త. పెళ్ళయితే ఆఖరావిడకూడా అత్తారింటికి వెళ్ళిపోతుంది" అంది కుముద.

"భలేదానివేనే! పల్లెటూరు అని భయపడ్తున్నావా! పూలమనసుల్లో నాయికది పల్లెటూరుకాదూ! చక్కగా అన్నంవండి మొగుడికి పట్టుకెళ్తూ, పొలాల గట్లమ్మట ఎగురుకుంటూ, పాటలు పాడుకుంటూ వెళ్లొచ్చును. ఎంత సరదాగా వుంటుంది!" అంది ఉత్సాహంగా తాయారు.

"అసలు అదికాదు. నాకు...నాకు సినిమాలో చేరాలని వుంది. దానికి మా వెంకటిగాడు అసలు ఒప్పుకోడు. వాడికి ఏం తెలీదు. అసలు చదువే చదువుకోలేదు" బెంగగా అంది కుముద.

"నిజంగా నీకు సినీమాల్లో చేరిపోవాలని వుందా! అదెంత సేపు! మా బావగారికి బోలెడుమంది తెలుసు! నిమిషంలో చేర్పించేస్తారు!" అంది డాబుగా తాయారు!

'నిజంగానా అక్కయ్యా గారూ!" ఆశగా అంది కుముద.

"పోలీసు ఇన్స్పెక్టర్లకి సినీమావాళ్ళు తెలీక పోవడ మేమిటి లే.!" అంది ఇంకా దర్పంగా విశాల!

"అయితే బావగారితో చెప్పొద్దురూ! నా చర్మం మీకు చెప్పులు కుట్టించి ఇస్తాను!" అమాయకంగా అంది కుముద. కాస్సేపు ఆలోచించింది విశాల. "అయితే ఒక పని చెయ్యండి! ఎల్లుండి మెయిల్ కి నువ్వూ, తాయారూ మద్రాసు వెళ్ళిపోండి! కావాల్సిన డబ్బు నేనిస్తాను. తాయారు పెద్దది. దానికి అన్నీ తెలుసును. నిన్ను సినిమాల్లో జేర్పించి తిరిగి వస్తుంది! అయితే మరి మీ వాళ్ళతో నేను, నిన్ను పంపుతూన్నట్లు చెప్పకూడదు మరి!" అంది బులిపిస్తూ, విశాల! "అమ్మో! చెత్తే ఇంకేమన్నా వుందా! చెప్పను!" అంది కుముద.

"వింతరాముడు సినీమా చూసేవుకదూ! అందులో నాయిక ఏం చేస్తుందీ! పెళ్ళికొడుకు పీటల మీద కూర్చునుండగా మేడదూకి పారిపోతుంది. తర్వాత అంతా వెతుక్కుంటారు! భలే సరదాగా వుంటుంది. ఇంట్లో చెప్పకుండా పారిపోతే!" అంది తాయారు. కుముద సరదా తోడు తీసుకుని తాయారు పీడవదుల్చుమంది విశాల! తాయారు బెడ్డింగులో సినీమా పత్రికలన్నీ చుట్టబెట్టి తెచ్చింది. వాట్లల్లో ఇచ్చిన అడ్రసుల ప్రకారం, ఇద్దరూ, స్టూడియోలమ్మట తిరుగుతోండగా వీరాసామి కంటపడ్డారు. 'వీరాసామి' వీళ్లకి వేషాలు ఇప్పిస్తానని తన తండా వున్నచోటుకి తీసుకపో

లేదు ! వీళ్ళకి తమిళం, డాన్సూ రాదు. ఇవి రెండూ, రాని వాళ్ళు, మద్రాసులో సినిమాల్లో చేరాలంటే కొంచెం కష్టమే? అప్పుడప్పుడు మిగతా వాళ్ళతో కలిసి వీళ్ళనికూడా స్టూడియోకి తీసుకపోయేవాడు ! అక్కడ వీళ్ళకి కూడా, రంగు పూసేవారు ! ఎక్కడ్నో చివరనించో పెట్టేవారు ! అందరూ చేతులెత్తితే వీళ్ళూ చేతులెత్తటం! కాళ్ళుజాచితే వీళ్ళూ కాళ్ళు వంకరగా పెట్టటం ! ఇద్దరికీ పదో పన్నెండో దొరికేవి ! వీరాసామికి తాయారంటే మోజు పెరిగింది. తరుచూ, "తాయారు"ని బయటకు తీసుకుపోతూవుండేవాడు. కుముద, నాగమ్మ, భద్రతో చేరి హిందీ చదువుకుంటూ, సినీమా పాటల కనుగుణంగా, చేతులూ, కాళ్లూ, కళ్లూ త్రిప్పటం ప్రాక్టీసు చేసేది. 'కుముద' సహజంగా చురుకయినది. ఏదైనా క్రొత్త విద్య నేర్చుకోవటంలో ఉత్సాహం ఎక్కువ; అందువల్ల అయిదారు నెల్లు గడిచేసరికి హిందీ, తమిళం మాట్లాడటం, సినీమా పాటల కనుగుణంగా, డాన్సు చేయటం వచ్చేసింది. మనిషి కూడా, చామన ఛాయలోంచి కొంచెం మెరుపుఛాయ వచ్చింది. కొంచెం కండబట్టి, జానెడు పొడుగు ఎదిగింది ! తలంటుపోసుకుని, పొడుగాటి జుట్టు ఆరబెట్టుకుంటుంటే నాగమ్మ, భద్ర "ఏం జుట్టే నీది ! నువ్వు ఎప్పటికన్నా ఈ ఫీల్డులో పైకి వస్తావు! ఇంత పొడుగాటి జుట్టు వున్న హీరోయిన్లెవరూ ఇప్పుడు ఈ ఫీల్డులో లేరు !" అంటూ మెచ్చుకునేవాళ్ళు. తాయారు, సినీమా హీరోయిన్ అవటానికి ప్రయత్నాలు ఏమీ చేసేది కాదు. తాయారుకి సహజంగా బద్ధకం ఎక్కువ ! ఇన్స్పెక్టర్

ధర్మమా అంటూ ఆ పిల్లకి తనఅందం తనకి తెలిసివచ్చింది. అందుకనే "వీరాసామి" చెప్పినట్లు బుద్ధిగా వినేది. ఆమె వల్ల డబ్బు చేరుస్తూన్నా, 'వీరాసామి'కి తాయారంటే ఆపేక్షగానే వుండేది. నాలుగయిదు షోకైన సిల్కు చీరలు, స్కార్ఫ్ వాచీ కొని పెట్టాడు. ఒక రోజు పాతిక మంది అమ్మాయిలను తీసుకొని స్టూడియోకి వెళ్ళాడు వీరాసామి! తాయారుది తిరిగేకాలు! ఒకచోట నిలిచేదికాదు! బజారుకి పోయివద్దామని "కుముద"ని బయలుదేరదీసింది. నాలుగయిదు వీధులు తిరిగే సరికి "వెంకట్రాజు" ఎదురు వచ్చేడు. అతను 'కుముద'ని ఆనవాలుపట్టేడు. "కుముదా!" అంటూ పెద్ద కేక పెట్టి నాలుగయిదు అంగల్లో వాళ్ళదగ్గరికి వచ్చాడు. కుముద ప్రక్కన పల్చని సిల్కుచీరలో మొగలి పొత్తిలా మిసమిసలాడుతూ సోగకళ్ళతో విస్ఫారితంగా చూస్తూన్న తాయారుని క్షణంసేపు పరకాయించి చూసేడు! కుముద జబ్బ గట్టిగా పట్టుకుని,

"కుముదా! ఇంట్లోంచి ఇక్కడకు చెప్పకుండా పారిపోయి వచ్చేవా! మీ నాయినా అమ్మ ఎంతగా ఏడుస్తున్నారో తెల్సా! పెళ్ళాడటం ఇష్టం లేకపోతే ఆ ముక్క చెప్పొచ్చుగా!" అన్నాడు. కుముదకి వళ్ళంతా చమటలు పట్టేసింది.! గుండెలు దడదడ లాడాయి. "అమ్మ నాన్న" ఆ ఇరుకు ఇల్లు, వెంకట్రాజుతో పెళ్ళి, గేదె, పేడ, రొచ్చు, కంపు, ఇల్లు అలుకోవటం ఇవి అన్ని జ్ఞాపకం వచ్చి ఆ పిల్ల శరీరం జుగుప్సతో ముడుచుకు పోయింది. మనస్సు స్థిర పరుచుకుంది. పైకి బింకంగా "నేను సిన్మాలో వేషాలు వేయ

టానికి వొచ్చేసాను. సిన్మాల్లో హీరోయిన్ పోర్షన్స్ ఇప్పిస్తారు కొన్నాళ్ళుపోతే! డాన్సు, భాష మాట్లాడడంకూడా నేర్చేసుకున్నాను. ఇంక ఇంటికి రాను.” దృఢంగా వెంకట్రాజు పిడికిలిని వదిలించుకుంటూ అంది కుముద.

తాయారు వెంకట్రాజుని ఎగాదిగా చూసింది. అతనికి పాతికేళ్ళు వుంటాయి. నల్లగావున్నా కాయకష్టం చేయటంనించి ధృఢంగా కండలుతిరిగి వున్నాడు. తాయారుకి, వెంకట్రాజు అంటే ఒక విధమైన అభిమానం కలిగింది. చిన్నవాడు. వయసులో వున్నవాడు. తాయారుకి ఈ ఆర్నెల్లలోనూ ఇంత ఈడూ జోడూ అయిన మగవాళ్ళతో పరిచయం కలగలేదు. ఆర్నెల్లకే తాయారుకీ జీవితమంటే వెగటుపుట్టింది. వీరాసామి తాయారుని ఎంత అపురూపంగా చూసుకొన్నా వయసూ, సొగసూలేని ప్రతి డబ్బున్న గాడిదకూ తనని అమ్మేయటం ఆమెకి నచ్చలేదు. అప్పటి ఆలోచనల్లోనే విశాల తనని ఎందుకని కుముదకి సాయంగా పట్నం పంపేసిందో అవగాహన అయ్యింది తాయారుకి. తన్ని తరిమేసి భర్తని తనకి మిగుల్చుకుందన్నమాట విశాల! రకరకాల అనుభవాలతో పదును తేరింది తాయారు మనసు. చెదిరిన జీవితాన్ని, కరిగిపోతున్న కాలాన్ని ఎలా కూడదీసుకోవాలా అని తపన చెందుతూన్న తాయారు కళ్ళకి వెంకట్రాజు కనపడటంతో సేదతీరినట్లు అన్పించింది. వీరాసామి ప్రక్కన ఒక చిన్న జమీందారిణిలా ఠీవిగా నించున్న తాయారుని ఓరకంట చూస్తూనే

"సిన్మాలో వేషాలు వేస్తావా ? అందుకనేనా పారిపోయావ్ ?" అన్నాడు. ఒకవంక పీటలమీది పెళ్ళి ఆగిపోవటం అతనికీ అవమానంగానే వున్నది. నిదానంగా అన్నా, కాల్చే చూపులతో చూసేడు కుముదని అతను ! వేడెక్కిన ఇనుములా వున్నాడు వెంకట్రాజు. వేడిమీద సుత్తితో బాదితేనే ఇనుము మనకి కావల్సిన విధంగా సాగుతుంది. తాయారు కళ్ళువాల్చి మృదువుగా నవ్వింది. "నేనూ వేషాలు వేదామనే వొచ్చేను. కాని ఇక్కడి కుళ్ళు నాకు నచ్చటంలేదు. ఇంటికి పోదామంటే మావాళ్ళు నన్ను రానీయరు" అంది. వెంకట్రాజు తాయారువంక వెర్రిగా జూసేడు. కుముద తాయారు మాటలను పట్టించుకోలేదు.

"మీరు కుముదతోనే వొచ్చేరా" అన్నాడు.

"నేను కుముదవాళ్ళింటి ఎదురుగా వున్న ఇన్స్పెక్టర్ గారి మరదల్ని" హుందాగా అన్నది. ఉద్యోగస్థులంటే పల్లెపట్టులోవుండే సన్నకారు రైతు యువకులకు గౌరవం ఎక్కువగానే వుంటుంది. చేతికి వాచీ అదీ జూసేడు వెంకట్రాజు.

"మీరు చదువుకున్నవారిలా కనపడుతున్నారు. మీరుకూడా ఎందుకిలా వొచ్చేశారు" అన్నాడు బాధగా.

"నేను బాగుంటానుకదా ! రాగానే హీరోయిన్ పోర్షన్స్ ఇచ్చేస్తారని ఆశపడి వొచ్చేశాను. ఇక్కడకు వస్తేకాని అసలుగోల తెలీలేదు" అన్నది తాయారు.

"అలాగా" ఆలోచనగా అన్నాడు వెంకట్రాజు. తర్వాత పది పదిహేను రోజులు పట్నంలోనే వుండి పోయేడు. వెంకట్రాజు పట్నంలో మూరుమూల హోట లులో వుండేవాడు. తాయారు తను పత్రికలలో, కథలలో, నవలలో చదివిన విజ్ఞానం అంతా వెంకట్రాజుమీద కుమ్మ రించింది. అతని కూడా వుండి రెండుమూడు తెలుగు సిని మాలు చూపించింది. దానితో వెంకట్రాజుకి తాయారును ప్రేమించాననడం వచ్చేసింది. ఒక శుభముహూర్తాన—

"రేపు నేను మనూరు వెళ్ళిపోతున్నాను" అంది కుము దతో తాయారు. కుముద నిర్ఘాంతపోయింది. వెంకట్రాజు పట్నంలోనే వున్నసంగతి కుముదకి తెలియదు. తన కన్నాళ్ళూ తాయారు పెద్దదిక్కుగా వున్నది. బెంబేలు పడ్డది కుముద.

"అదెట్లాగ ! నాకన్నా నీకు ముందే మంచి ఛాన్సు లొస్తాయన్నాడుగా వీరాసామి ?" అంది.

"వూరికే అంటాడు. అంతేకాని నాకేం ఛాన్సులు రావు. నాకు నీలాగా పాడటం, ఆడటం రావటంలేదు. భావాలు కూడా నేర్చుకోలేదు. వుట్టి డమ్మీలాంటి దాన్ని. నాకు వేషంవొచ్చినా బాగా చెయ్యలేను. మా అక్కని చూడాలనుంది" అన్నది తాయారు.

"మళ్ళీ వొస్తావా !" అంది కుముద. ఏదో నాలుగు రోజులు అక్కడగ్గరుండి వచ్చేస్తే ఫరవాలేదు అనుకుంది కుముద.

"ఏమో నేను చెప్పలేను. పెళ్లిసంబంధాలు వొస్తున్నా యని వ్రాసింది అక్క. పెళ్లికుదిరితే ఇంక రాను" అంది తాయారు, మళ్ళి అయిష్టంగానే.

"నువ్వు కూడా వచ్చేయరాదూ!" అంది లోప ల్లోపల ఎక్కడ వచ్చేస్తానంటుందో అని బితుకు బితుకు మంటూనే వుంది తాయారుకి.

"నేనా!" అంది కుముద. అలా ఆలోచించటం చూసి భయపడిపోయింది తాయారు.

"నీకు చలాకీతనం వుంది. చక్కగా పాడుతావు! కొంచెం పొడుగుకూడా పెరిగావు. ఇక్కడున్న అందరిలోకీ నువ్వే బాగుంటావు. అంచేత నీకింక మంచి వేషాలే వొస్తాయి! ఈ సమయంలో వూళ్ళో లేకుండా వుంటే ఆ ఛాన్సు ఇంకోళ్ళు తన్నుకుపోతారు. అంచేత హీరోయిన్ అయ్యేదాకా, ఇటూ అటూ తిరక్కుండా వుంటం మంచిది" అన్నది. కుముద కళ్ళముందు ఇంద్రభవనంలాంటి ఇల్లూ, ఇంటినిండా, చకచకా గెంతులేస్తూన్న బొచ్చుకుక్కపిల్లలూ, వాకిట్లో గేట్లో గూర్ఖావాడూ, పెడ్డులో పెద్ద లాంచీ లాంటి కారూ ఇవన్నీ వరసాగ్గా వచ్చి నించున్నాయి. తను స్వర్గారోహణలో మొదటిమెట్టు ఎక్కింది. ఇప్పుడు తను మళ్ళీ ఆ నరకకూపంలోకి ఎందుకు పోవటం?

"నేను రాలేనులే. వచ్చేవారం 'జండాబాబు' చిత్రంలో హీరోయిన్ ప్రక్కన నించునే వేషం వుందన్నాడు వీరాసామి" అంది కుముద.

"ఇంకేం ! ఈ చిత్రంలో నీ ముఖం బాగా కనపడితే ఇంక పెద్ద పెద్ద వేషాలు ఇచ్చేస్తారు. అదిసరే కాని నేను వెళ్లిపోయేదాకా, వీరాసామి కి సంగతి చెప్పమాకేం ?" అంది. "అలాగే లే" అంది కుముద.

వీరాసామికి తాయారు వెళ్ళిపోవటం నచ్చ లేదు. రెండు మూడేళ్ళు తాయారు వుంటే, 'వీరాసామి' ఒక చిన్న పిక్చరుకి సరిపడడబ్బు పోగేయగలను అనుకున్నాడు. మధ్యలో మోసంచేసి వెళ్ళిపోయింది. ఇంక గుడ్డిలో మెల్లలా కుముదని ఆశ్రయించక తప్ప లేదు. కొన్నాళ్ళు గడిచేసరికి 'తాయారు' వుంటంవల్ల తన కెంత నష్టమో తెలుసుకోగలి గింది కుముద !

తాయారు తెలుగు సినిమాలోలా వెంకట్రాజు చేత పసుపుకొమ్ము పచ్చ తాడుకి గుచ్చి కట్టించుకుంది. ఇంటికి వెళ్ళేసరికి ముందు వెంకమ్మ 'ఇదెవత్తిరా నాయినా !' అంటూ గోల చేయబోయినా, ఆ పిల్ల ఇన్స్పెక్టర్ గారి మర దలు అని తెలియగానే నోరుమూసుకుంది. తాయారుని గౌరవంగా చూసుకునేవాడు వెంకట్రాజు. వరసగా అయి దుగురు పిల్లల్నికని ఇంక ఇప్పుడు ఇల్లాలే అయిపోయింది తాయారు. 'కుముద' చెల్లెలు పెళ్ళిలో 'తాయారుని' చూసి ఆశ్చర్యపోయింది విశాల ! తాను ఎక్కడ ముంచింది ? ఈ పిల్ల ఇక్కడెలా తేలిందీ ? అని విశాల ఆలోచించింది. చాటుకి పిలిచి, 'కుముద ఏమయ్యిందే ?' అని అడిగింది, విశాల తాయారుని. జరిగిన సంగతంతా చెప్పింది. పెళ్ళి పందడి అణిగాక, తాయారునీ వెంకట్రాజుని ఇంటికి తీసుకు

వెళ్ళి భోజనంపెట్టి కొత్తబట్టలిచ్చి పంపింది విశాల. దానితో కోడలు గొప్పింటిపిల్ల అని పొంగిపోయింది వెంకమ్మ.

చురుకుతనం, మంచితనం వున్న 'కుముద' వీరాసామి ఆసరాతో అతివేగంగానే చిత్రలోకంలో హీరోయిన్‌గా స్థానం సంపాదించుకుంది. లక్షలకు లక్షలు డబ్బు ఆర్జించింది. ఇంద్రభవనం, బొచ్చుకుక్కలూ, గూర్ఖా, అందమైన పర్సనల్ సెక్రటరీ అన్నీ సమకూరాయి. ఆమెకు బాధ అనేది నటించటంలోతప్ప నిజజీవితంలో తెలియటానికి వీలులేనంతటి అంతస్థు సంపాదించింది. తాయారు వెంకట్రాజుని పెళ్లి చేసుకున్నానని జాబువ్రాస్తే ఎంతో జాలిపడింది. పిల్లలు పుట్టినప్పుడల్లా తాయారు జాబులు వ్రాస్తూనే వుండేది. కుముద బహుమతులు పంపుతూనే వుండేది. ఎన్ని పనులున్నా తాయారు జాబులకు తనే స్వయంగా జవాబులు వ్రాసేది. అట్లాంటిది తాయారునుంచి ఒక కార్డుముక్క ఈ ఆర్నెల్లనుంచి రాకపోవడంతో కుముద మనసు ఆగలేకపోయింది. వరసగా కొన్ని రాత్రిళ్ళు షూటింగ్ నాటకాళ్ళతో ఆలోచించి, ఇంక స్వయంగా బయలుదేరిపోయింది. శక్రటరీకూడా బయలుదేరాడు.

"నువ్వు రానక్కర్లేదు. నేను రెండు రోజులలో వచ్చేస్తాను. నేను సభలకి, సన్మానాలకి వెళ్ళటంలేదు. మామూలు మనిషిగా బంధువుల్ని చూడటానికి వెళుతున్నాను. నువ్వు అనవసరంగా దీనికి పెద్ద పబ్లిసిటీ ఇయనక్కరలేదు" అంది కుముద. చాలా జాగ్రత్తగా రెండో కంటివాడికి తెలీకుండా కుముద తాను సృష్టించుకున్న అద్భుత ప్రపంచంనుండి

మామూలు నరకంలోకి వచ్చిపడింది. ఎర్రటి మట్టిరోడ్డు మీద గోట్టికాయలాడుకుంటున్న పిల్లల్ని తదేకంగాచూస్తూ నించున్న ఆరేళ్ళ కన్నయ్యా తమ గుమ్మంముందు చిన్న అల్లిక బుట్టా, లెదర్ సూటుకేసూ పట్టుకు నించున్న కుము దని జూసి "ఎవరు కావాలండి" అంటూ ముందుకు వొచ్చేడు.

"వెంకట్రాజుగారిల్లిదే కదూ" అంది కుముద.

"ఇదే ఇదే! అమ్మోవ్ మనింటికి ఎవరో మాంచి చుట్టాలొచ్చేరే" అంటూ లోపలికి పరుగుపెట్టాడు. అసుర సంధ్యవేళ అయింది. మండువాలో కొంచెం వెలుతురు తక్కువగావుంది. కుముద తన పెట్టె, బుట్టా మండువాలో పెట్టి లోపలికి వెళ్ళింది. వంటింట్లో పొయ్యిముందు వుంది తాయారు. అన్నంవార్చి పొయ్యిమీదకి పులుసుగిన్నె ఎక్కిస్తూ కోడుకుమాటకి వెనక్కి తిరిగి చూసింది. పొయ్యి భగభగా మండుతోంది. ఆ ఎర్రటి వెలుగులో, నిరాభర ణంగావున్నా ఒక విధమైన తళుకుతో మెరుస్తూ కన్పించింది కుముద. "నువ్వా! ఎలా వొచ్చేవ్" అంది తాయారు తెల్లబోతూ.

తన్ని చూడగానే పట్టరాని ఆనందంతో కౌగలించు కొంటుంది తాయారు అనుకొంది కుముద. కానీ తాయారు తెల్లగా పాలిపోవటంజూసి కుముదకి భయమేసింది. అలా బెదురుతుందేమిటి తాయారు? తన్ని తను సంబాళించుకుని అంది కుముద.

"భలేదానివేనే! ఎప్పటికప్పుడు రావాలనే అనుకుంటున్నాను. ఈ షూటింగులతో ఎక్కడా ఎడతెరపి లేకుండా వున్నది. ఎట్లాగో వీలుచూసుకుని వచ్చేశాను. అత్త బాగున్నదా? బావేడీ? ఇంకా ఈ వూరికి కరెంటు రాలేదా! ఎలాగుంటున్నారే బాబూ!"

"పొలం వెళ్ళాడు మా బావ. ఇక వచ్చే వేళయింది. ఇక్కడ పొగ. బయట కూర్చుందాం పద" అంది. పెరట్లో వేపచెట్టుక్రింద నులకమంచం వాల్చివుంది. దానిమీద ముగ్గురు పిల్లలు అడ్డదిడ్డంగా పడుకొని కథలు చెప్పుకుంటున్నారు. చెట్టుకి జేరవేసివున్న ఇంకో మంచం వాల్చింది. దానిమీద ఇద్దరూ కూర్చున్నారు. "ఏమిటి కథ ఇలా వచ్చేవ్" అంది మళ్ళీ.

"మిమ్మల్ని చూడాలనిపించింది వచ్చేను. అత్త లేదా" అంది కుముద.

"లేదు. రెండోవదిన ఇంటికి వెళ్ళింది. మా ఇంటికి వెళ్ళావా! నీ తర్వాత ఇద్దరి చెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళు అయినాయి" అంది తాయారు.

"ఇంకా వెళ్ళలేదు. ముందు ఇక్కడికే వచ్చాను. తాయారూ! నీ చలవవల్ల ఈరోజు ఇంత ఉన్నతస్థితిని సాధించాను. నా పురోభివృద్ధికి పునాదిరాయి వేసినది నువ్వు. నా జీవితంలో భగవంతుడైనా నీ తర్వాతనే ప్రార్థిస్తాను. నిన్ను నేను ప్రతిక్షణం తలుచుకుంటూ వుంటాను" అంది కుముద. మనస్సు ముందు పరిచి, అంత

ఆరాధనగా కుముద మాట్లాడుతోంటే, తాయారు ఏమీ మాట్లాడలేకపోయింది. పులుసుపొంగి పొయ్యిలోకి జారినట్లుంది. 'చంయ్' మంటూ చప్పుడు; వంటింటి కిటికీలోంచి ఉమ్మరంగా పొగ వచ్చింది. "పులుసు మరుగుతూన్నట్లుంది. దింపి వస్తానుండు" అంటూ వంటింటి లోనికి వెళ్ళింది. తాయారు ప్రవర్తన కుముదకి చాలా ఆశ్చర్యం కలిగించింది. తను వచ్చినందుకు ఎంతో సంబరపడుతుందనుకుంది. 'ఫలానా తార' మా వారి మేనమరదలే! అంటూ గొప్పగా అందర్ని పిలిచి చెబుతుందనుకుంది. తను రావటంవించి, ఎంతో హైరాను పడుతూ తనకి, ప్రత్యేకం వంటకాలూ, అవీ తయారు చేయించాలని తహతహ పడుతూంటే తను వద్దని వారిస్తూ, వాళ్ళతోపాటే ఏదుంటే అది తినివుంటే "నువ్వేమీ మారలేదే కుముదా! ఇంత ఐశ్వర్యం, లక్షలాది ప్రజల ఆదరాభిమానాలూ, నీలో కొంచెమన్నా గర్వం పెంచలేదే కుముదా" అంటూ తన్ని బాష్పపూరిత నయనాలతో కౌగలించుకొంటుంది అనుకుంది. కాని తాయారు తాను ఇన్ని రోజులుగా వూహించుకున్నదానికి భిన్నంగా వుంది. ఆమె చేతులారా వదిలిన అవకాశాన్ని తాను అందిపుచ్చుకున్న దన్న అసూయ కాదుకదా, కొంపదీసి? అంతే అయివుంటుంది అని నిర్ధారించుకొంది కుముద. వేరుశనక్కాయల మూటల భుజాని కెత్తుకొని, పెరటిలోనికివచ్చి వరండామీద దభీమని పడేశాడు వెంకట్రాజు. వేపచెట్టు రెమ్మల్లోంచి, ఫలచగా జారుతున్న సందెవెన్నెల్లో మంచంమీద కూర్చున్న వ్యక్తిని ఆనమాలుపట్టలేదు. మృదువైన చందన

పరిమళంతో పొందికగా కూర్చున్న ఆ స్త్రీమూర్తి ఎవరా అని పరకాయించిచూస్తూ "ఎవరదీ" అన్నాడు.

"నేనే బావా" అంది కుముద. వెంకట్రాజు ముఖం ఆనందంతో వెలిగింది. "నువ్వా కుముదా! నా ఉత్తరాలు అందాయా? ఏకంగా నువ్వే వచ్చేశావేమిటి. ఒక్కదానికీ జవాబు వ్రాసేవుకావేం?" అన్నాడు. గబగబా మంచం దగ్గరికివచ్చి నించున్నాడు. ఈసారి ఇంకా ఆశ్చర్యపోయింది కుముద "ఉత్తరాలు వ్రాసేవా! నువ్వా! ఏమని బావా?" ఆదుర్దాగా అడిగింది. ఆమె కంఠంలోని మృదుత్వానికి మాటల్లోని ఆప్యాయతకి వెంకట్రాజు హృదయం పులకించిపోయింది. ఎంతయినా మేనమామ కూతురు. "అదికాదు కుముదా! మూడేళ్ళనుంచి పొలం పండటంలేదు. ఒకఏడు వరదలువచ్చి, ఒకఏడు వానలు కురియకా నానా అవస్థా పడుతున్నాం గింజలు చేతికివచ్చేదాకా నమ్మకం వుండటం లేదు. ముప్పూటలా ఎనమండుగుర్ని పోషించాలి. నేనూ పిల్లలూ మలమల మాడిపోతున్నాం. అమ్మ ఇంక మా అవస్థలు చూడలేక, చిన్నక్కదగ్గరికి వెళ్ళిపోయింది. తాయారు నీకు ప్రాణస్నేహితురాలు. నేను నీకు మేనత్తకొడుకుని. అందుకని ఏదన్నా సాయంచేస్తావని వ్రాస్తే జవాబే రాలేదు. అయిదారు ఉత్తరాలు వ్రాసి వ్రాసి ఇంక నువ్వు మమ్మల్ని ఆదుకోవటానికి ఇష్టపడుటలేదేమో అని వ్రాయటం మానుకున్నాము" అన్నాడు వెంకట్రాజు.

"నువ్వు నాకు ఉత్తరాలు వ్రాశావా బావా" ఆశ్చర్యంగా అంది కుముద.

"నేను వ్రాయలేదు. దానిచేతే వ్రాయించాను" ఖిన్నుడై అన్నాడు.

"శక్రటరీ అన్ని ఉత్తరాలూ చదువుతాడే. అందులో తాయారు వ్రాస్తే నేను స్వయంగా జాబు వ్రాస్తానని అతనికి తెలుసును. మీ ఉత్తరాలు ఎంచేతో అందలేదు బావా. ఇన్నాళ్ళయి మీనుంచి జాబు రాకపోతే ఏంచేస్తున్నారో అని నేనే వచ్చేశాను బావా, మీకంత ఇబ్బందిగా వుంటే అక్కడికే వచ్చేయలేకపోయారా. ఉత్తరాలువ్రాసి నా అనుజ్ఞ కోరాలా. నా అన్న బంధువు కనపడక ఎంత కొట్టు మిట్టాడుతున్నానో మీకేం తెలుసు. ఏమే తాయారూ" అంది ఆత్మీయతగా కుముద. అంతవరకూ చీడీమీద నుంచున్న తాయారు "అంతేమరి" అంటూ లోపలికి వెళ్ళింది. వెంకట్రాజు సంబరపడుతూ "నాకు నీసంగతి అంతా తెలుసు కుముదా. నీ వాదుకుంటావని నాకు నమ్మకంవుంది. పదవే అంటే ఈ దరిద్రముఖం కదుత్తేనా" అన్నాడు విసుగ్గా. కుముద మాట్లాడలేదు.

చింతచిగురు పప్పూ, పులుసుతో బావామరదళ్ళకి వడ్డించింది తాయారు. మారుమాటాడకుండా భోజనం చేసింది కుముద. పిల్లలు కుముదచుట్టూ చేరారు. పళ్ళు బిస్కట్లు ఇచ్చింది. ఎగబడి ఆబగా అక్కడి వక్కడే తినేశారు. రాత్రి బాగా పొద్దుపోయేదాకా వెంకట్రాజుతో కబుర్లుచెపుతూ కూర్చుంది కుముద. తనెలా పైకి వచ్చిందో,

సినిమాలు ఎలా తీస్తారో, అందులో ఎలా యాక్షన్ చెయ్యాలో అన్నీ వివరంగా కుముద చెబుతోంటే చెవులు అప్పగించి విన్నాడు వెంకట్రాజు. అతన్నికూడా వచ్చేయమని, పట్నంలో ఏ బట్టలషాపో, స్టీలుగిన్నెలషాపో తెరుస్తే హాయిగా బ్రతకొచ్చనీ అతని వ్యాపారానికి తాను మదుపు పెట్తాననీ, లాభంవస్తే కొద్దికొద్దిగా అప్పు తీర్చేయొచ్చునని చెప్పింది. అన్నీ విన్నాక, వెంకట్రాజు "నువ్వు ఎంత తెలివయిన దానివే కుముదా! ఆరోజు నువ్వు స్థిరంగా రాను అన్నావు కనుకనే ఈనాడు ఇంతదానివయ్యావు. లేకపోతే నన్ను కట్టుకుంటే ఏముంది? తాయారుచూడు. కట్టుకుందుకు నాణ్యమైన గుడ్డలయినా లేక అవస్థపడుతోంది. నువ్వు ఇంత సంపాదించావు కనుకనే నాబోటి వాళ్ళకి సహాయపడాలని తాపత్రయ పడుతున్నావు. మీ నాన్న తెలివితక్కువవాడు కనుకనే నీవద్దకు వచ్చివుండలేదు. మీ చిట్టి ఎంత బాగుంటుంది. డబ్బు తేలేక కిళ్ళీకొట్టు శరభయ్యకి మూడోపెళ్లిగా చేసేశాడు" అన్నాడు వెంకట్రాజు. ముందు సావిట్లోకి మంచాలు జేరవేసి వాటిమీద చిరుగుల బొంతలు పడేసింది ఒకదానిమీద కుముద జేరబడింది. రెండోదానిమీద తాయారు వెంకట్రాజు కూర్చున్నారు.

"కుముద తనతో వచ్చేయ మంటోంది" అన్నాడు.

"ఇకనేం?" అంది తాయారు.

"నే చెప్పలా! దానికి చిన్నప్పట్నించీ మేమంటే ప్రేమే. ఒకసారి ఏమయిందనుకున్నావ్. అట్లతద్దికి కుముదా నీకు జ్ఞాపకం వుందా?" అన్నాడు. కుముదకి జ్ఞాపకం

వచ్చింది. ఇంక తమ పెళ్ళి ఏడాదికి స్థిరపరుచుతారనగా ఈ ఊరు వచ్చింది. అట్లతద్ది నోము నోచింది. ఇరుగూ పొరుగూ కన్నెలతో పొలానఉన్న రావిచెట్టు ఊయల దగ్గరికి వెళ్లింది. వెంకట్రాజు అందర్నీ ఊపేడు. తన్నీఊపేడు బాగా ఊపగానే తనకి కళ్ళు తిరిగాయి. చేతులు పట్లువదిలాయి. "అమ్మోయ్" అంటూ గావుకేక పెట్టింది. కళ్ళు విప్పేసరికి వెంకట్రాజు చేతులలో తను. ఎంతో ఇదిగా వీపుమీద చేత్తోరాస్తూ తన జడుపు పోగొట్టటానికి ప్రయత్నించుతున్నాడు.

కుముదకి వళ్ళు జలదరించింది, కళ్ళు చెమర్చాయి. ఎప్పటి సంగతి - బావ గుండెలో పదిలంగా దాగుంది. ప్రేమంటే ఇదేనా ! తాను ఎంతమంది హీరోల కౌగలింతల లోనో కరిగిపోయినట్లు నటించింది. విరహం, కలయిక ఇన్ని అనుభూతులనీ ప్రదర్శించింది. కొంతమంది హీరోలు తనను నిజంగానే గట్టిగా వాటేసుకునేవారు. కొంతమంది పెద్దమనిషి తరహాగా ప్రవర్తించేవారు. ఇన్నిరోజుల శృంగార ఘట్టాల నటనలోనూ ఈ అనుభూతి తన మనసుని తాకలే దెందు చేత ? అది నటన. ఈ తీయని బాధ, ఆవేదన తన హృదయంలో ఎక్కడో అట్టడుగున నిద్రపోతోంది. ఒక తీయని మాట ! ఒక మృదువైన చూపు తన హృదయాన్ని మండే జ్వాలనుంచి హాయైన చల్లని నీడకుజేర్చి సేదతీర్చుతాయి.

"అబ్బ ! నిద్రవస్తోంది. పదండి బాబూ" విసుగ్గా అంది తాయారు. రాక రాక తనువస్తే ఆమె ఒక్కమాట మాట్లాడలేదు సరికదా, బావనికూడా సరదాగా కబుర్లు

చెప్పుకోనీయదేమిటి ? అనుకుంది కుముద. గదిలోంచి సన్నగా తాయారు గొంతు విన్పించింది. వినకూడదు అను కొంటూనే చెవులు దోరబెట్టింది కుముద. "ఏమిటి ఆ బాతా ఖానీ ! దాని వెంటబడి పోదామనుకుంటున్నారేమిటి" అంది తాయారు.

"ఏం వెళ్ళితేనేం ! నా మేనమామ కూతురు. ఆపదలో అడ్డుకున్నవాళ్లు భగవంతునితో సమానం" అన్నాడు వెంకట్రాజు.

"ఛీఛీ ! సిగ్గు లజ్జా లేకపోతేసరి" ఛీత్కరించింది తాయారు. కుముదకి కళ్ళు తిరిగినంతపని అయింది.

"మాటలు తిన్నగా రానీయి" కోపంగా అన్నాడు వెంకట్రాజు.

"ఏం ? అంటే ఏం ? దాని డబ్బు చూసి మెరమెరలాడుతున్నావు. నీకు డబ్బు ముఖ్యంఅంటే నాకు చెప్పకపోయావా. దానికన్నా వేయిరెట్లు ఎక్కువ సంపాదించగలను. నీకు నీతి కావాలనుకున్నాను. ఒళ్ళమ్ముకునేదాని పంచన పడుంటానికి సిద్ధపడతావని నాకేం తెలుసు ?"

"నోర్ముయ్యి !" అన్నాడు వెంకట్రాజు.

"మూస్తాను ! మూయకేం జేస్తాను ! డొక్కలు మాడుతున్నాయి కదా అని దానిప్రక్కన జేరుతావా ! ఇవ్వాళ ఇది చేశావు. రేపు మన ఆడపిల్లలు ఎదిగితే, నువ్వు కూడా, వెంకటయ్యనీ, వీరాసామినీ బ్రతిమాలి వాళ్ళని అప్పగించుతావు. నాకది ఇష్టంలేదు. నా పిల్లలు నీతిని వదలటానికి వీలులేదు; నీ వంశం ఎట్టాంటిది ! నిప్పులాంటిది !

దానితండ్రికి డబ్బు అక్కరలేకనేనా, దాని పంచకు చేర లేదు. అంతమంది పిల్లలతో నిత్యదరిద్రంలో అనుభవిస్తూ కూడా, కూతురు లక్షల కధికారిణి అయినా, ఒక్క పైసా అయినా, ఆమెనించి తీసుకున్నాడా !"

వెంకట్రాజు కుక్కిన పేనులా నోరు మూసుకున్నాడు.

"వేషాలు వేస్తోంది అనుకున్నాను. ఇట్లాంటివి వుంటా యని నాకేం తెలుసు" అన్నాడు నెమ్మదిగా.

"నాకు తెలుసు. అందుకనే ఆ రొంపిలోంచి ఇవతలకు పడ్డాను. ఎప్పుడు ఏ ఆధారం దొరుకుతుందా అని ఆర్నెల్లా ఆరుయుగాలుగా తపించిపోయేను. ఇప్పుడయినా ఒక్కరోజు బయట నిలబడ్డానంటేచాల్కు. ఆ మున్సబు కొడుకూ, కరణం తమ్ముడూ, గింగిరాలు తిరుక్కుంటూ, రాయ బారాలు పంపటం మొదలుపెట్టారు ! అదిష్టంలేకే..." అంది తాయారు.

వెంకట్రాజు తాయారు పతివ్రత తనానికి మురిసి పోయేడు.

"నిజమేనా తాయీ !" అంటూ ఆమెని గుండెలకి నొక్కుకున్నాడు.

కుముద మనస్సు గిజగిజలాడింది. తాయారుకి తన మీద వున్న అభిప్రాయం ఇదన్నమాట ! వెంకట్రాజు ఉత్తరాలు వ్రాయమన్నా వ్రాసివుండదు. ఇంత నీచంగా తన గురించి వూహించుతూన్న తాయారంటే, ఆమె పిల్ల లంటే తన కెందుకింత ఆత్మీయత ! ఇంత సంపాదనా ఎవరి కోసం ! వెంకట్రాజు అమాయకత్వాన్ని ఆసరాగా తీసు

కుని తను ఇల్లాలు అయింది తాయారు ! తన పసితనపు ఆశ యాలు ఊతగా తీసుకుని ప్రమాదంనించి బయటపడింది విశాల. అక్కా-చెల్లెళ్ళ మోసపు స్నేహంలో మునిగి తాను ఏమయింది ?

తెల్లవారకట్ల, ఇంకా ఎవరూ లేవకుండానే లేచి బయలుదేరింది కుముద. పంటకాలువ దాటబోయేసరికి సూర్యోదయమయ్యింది. కాలువ వడ్డున ఒక చేప ఎగురు తోంది. అది తిరిగి కాలవలోనికి వెళ్ళాలని శతవిధాల ప్రయత్నంచేస్తోంది. కాని వెళ్ళలేకపోతోంది. ఎక్కడ్నించో కాకులువచ్చి దానిచుట్టు ముట్టాయి కావ్ కావ్ మంటూ. ఆ చేప గింజుకుంటూనే వుంది; అలా చూస్తూనే నిలబడింది కుముద.

కారు హారన్ విని త్రుళ్ళిపడింది కుముద. ఎదురుగా రోడ్డుమీద కారు ఆపి శక్రటరీ కారుదిగి పరుగెత్తుకు వచ్చేడు!